క్లుప్తంగా

వర్ని బీజేపీ అధ్యక్షుడిగా రమేష్



వర్ని: వర్ని మండల బీజేపీ అధ్యక్షుడిగా తగిలేపల్లి గ్రామానికి చెందిన ఆవుల రమేష్‌ను నియమిస్తూ జిల్లా కమిటీ ఉత్తర్వులు జారీ చేసింది. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను మండల అధ్యక్షులు రమేష్‌కు బుధవారం జిల్లా కమిటీ అందజేసింది. తనపై నమ్మకంతో మండల అధ్యక్షులుగా నియమించినందుకు బాధ్యతతో పార్టీ పటిష్టతకు కృషి చేస్తూ కార్యకర్తలకు అందుబాటులో ఉంటానని రమేష్ వెల్లడించారు.

ఎమ్మెల్యేను కలిసిన న్యాయవాదులు



పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ బార్ అసోసియేషన్ న్యాయవాదులు బుధవారం ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా న్యాయవాదులు ఎమ్మెల్యేను సన్మానించారు. అలాగే ఆర్మూర్ బార్ అసోసియేషన్ కార్యాలయానికి రావాలని కోరారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జక్కుల శ్రీధర్, ప్రధాన కార్యదర్శి జెస్సు అనిల్, ఉపాధ్యక్షుడు గటాడి ఆనంద్, కుందారం శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

వజ్రోత్సవాలు విజయవంతం చేయాలి



రుద్రూర్: మండల కేంద్రంలోని శ్రీ సార్వజనిక్ గణేష్ మండలి వజ్రోత్సవ వేడుకలు విజయవంతం చేయాలని, ఇందుకు అందరు తమ వంతు సహకారాన్ని అందించాలని కమిటీ సభ్యులు తీర్మానించారు. మండల కేంద్రంలో శ్రీ విఠలేశ్వర ఆలయంలో బుధవారం సన్నాహక సమావేశాన్ని సభ్యులు ఏర్పాటు చేశారు. కార్యక్రమం చేయడానికి గ్రామ పెద్దలు, యువకులు, వివిధ సంఘాల సభ్యుల సలహాలు తీసుకున్నారు. మరోసారి సమావేశాన్ని ఏర్పాటు చేసి కార్యక్రమాల వారీగా కమిటీలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు చిదుర వీరేశం, గెంటిల సాయిలు, మాజీ సర్పంచ్ ఇందూర్ చంద్రశేఖర్, విండో మాజీ చైర్మన్ పత్తి రాము, మాజీ ఉప సర్పంచ్ డౌర్ సాయిలు, కర్కె అశోక్ తదితరులు పాల్గొన్నారు.

వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన ఉత్సవం


వేల్పూర్: పడగల్‌లో బుధవారం పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి 332వ ఆరాధన ఉత్సవాన్ని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం వద్ద నిర్వహించారు. అర్చన, అభిషేకం, మంగళహారతులతో మహిళలు పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. విశ్వ బ్రాహ్మణ సంఘం సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఆపరేషన్ సిందూర్ సంబురాలు



ముప్కాల్‌లో టపాసులు కాల్చుతూ సంబురాలు చేస్తున్న బీజేపీ నాయకులు

బాల్కొండ: పాకిస్తాన్‌పై భారత్ చేసిన 'ఆపరేషన్ సిందూర్' విజయవంతం కావడంతో బాల్కొండ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో, ముప్కాల్ మండల కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో బుధవారం సంబురాలు నిర్వహించారు. త్రివర్ణ పతకాన్ని రెపరెపలాడించారు. పహల్గామ్ మృతులకు నిజమైన నివాళి అందిందని నాయకులు వ్యాఖ్యానించారు.



త్రివర్ణ పతాకంతో కాంగ్రెస్ నేతలు

యువ వికాసం సర్వే వేగవంతం చేయాలి



నిజామాబాద్ సిటీ: మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో చేపడుతున్న రాజీవ్ యువ వికాసం సర్వేను త్వరగా పూర్తిచేయాలని మున్సిపల్ కమిషనర్ దిలీప్‌కుమార్ సూచించారు. బుధవారం బల్దియా కార్యాలయంలో వార్డు ఆఫీసర్లు, విభాగాల అధిపతులతో రివ్యూ సమావేశం నిర్వహించారు. ఇప్పటి వరకు 13 వేల దరఖాస్తులు వచ్చాయని, 50 శాతం సర్వే పూర్తి చేశారని, మిగతావి త్వరగా పూర్తిచేయాలని ఆదేశించారు.

మత్తు పదార్థాల జోలికి వెళ్లొద్దు

- కల్తీ కల్లుకు బానిసై జీవితాలను నాశనం చేసుకోవద్దు
- ప్రజలతో ప్రతిజ్ఞ చేయించిన యాంటీ నార్కోటిక్స్ బ్యూరో పోలీసు అధికారులు



సాలూరలో అవగాహన ర్యాలీలో పాల్గొన్న ఏఎన్‌బీ అధికారులు, పోలీసు అధికారులు, స్థానికులు



చేపూర్‌లో అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర్ రెడ్డి



రుద్రూర్‌లో .. డీఎస్పీ రమేశ్

సాక్షి నెట్‌వర్క్ : గంజాయి, కల్తీ కల్లు వంటి మత్తు పదార్థాల జోలికి యువత వెళ్లవద్దని నార్కోటిక్స్ బ్యూరో పోలీసు ఉన్నతాధికారులు సూచించారు. బుధవారం జిల్లా పోలీస్ కమిషనర్ సాయి చైతన్య ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా తెలంగాణ యాంటి నార్కోటిక్స్ బ్యూరో ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు నిర్వహించారు. చేయి చేయి కలుపుదాం ..డ్రగ్స్ రహిత తెలంగాణాను సాధిద్దాం అంటూ ర్యాలీలు చేపట్టారు. ఈ సందర్భంగా పోలీసు ఉన్నతాధికారులు మాట్లాడుతూ.. పిల్లలు పక్కదారి పట్టకుండా తల్లిదండ్రులు ఎప్పుడూ గమనిస్తుండాలన్నారు. మత్తు పదార్థాలు సేవించడం వల్ల మెదడు నియంత్రణ కోల్పోయి నేరాలకు పాల్పడే అవకాశం ఉందన్నారు. ఎవరైనా మత్తు పదార్థాలకు అలవాటు పడితే 1908, 100కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. మాదకద్రవ్యాలు విక్రయించిన వారికి, వాటిని ప్రోత్సహించిన వారికి ఏడేళ్ల జైలు శిక్ష పడుతుందన్నారు. అనంతరం ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. మహిళా సంఘాల సభ్యులు, వైద్య, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



వేల్పూర్‌లో మాట్లాడుతున్న ఎస్సై సంజీవ్



ముప్కాల్ మండల కేంద్రంలో ప్రజలతో ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు



బోధన్‌లో మాట్లాడుతున్న యాంటీ నార్కోటిక్స్ బ్యూరో ఏసీపీ సుబ్బరామిరెడ్డి



కోటగిరిలో అవగాహన ర్యాలీ చేపడుతున్న అధికారులు, స్థానికులు



బాల్కొండలో.. సీఐ రాంప్రసాద్



నందిపేటలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు



జన్నేపల్లిలో..



పాత వర్నిలో.. ఎస్సై ప్రవీణ్ కుమార్



గుత్పలో ఆట వస్తువులు పంపిణీ చేస్తున్న డీఎస్పీ బుచ్చయ్య



కమ్మర్‌పల్లిలో యువకులకు క్రీడా పరికరాలు అందజేస్తున్న ఎస్సై అనిల్ రెడ్డి



డొంకేశ్వర్‌లో పోస్టర్లను ప్రదర్శిస్తున్న అధికారులు, మహిళలు

'గాలికుంటు' నివారణ టీకాలు వేయించాలి



బస్వాపూర్‌లో టీకా వేస్తున్న జిల్లా పశువైద్యాధికారి రోహిత్ రెడ్డి

రుద్రూర్: పశువులకు తప్పనిసరిగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని జిల్లా పశువైద్యాధికారి రోహిత్ రెడ్డి అన్నారు. రుద్రూర్ మండలం సులేమాన్‌నగర్, కోటగిరి మండలం అడ్కాస్‌పల్లి, బస్వాపూర్ గ్రామాల్లో పశువులకు వేస్తున్న టీకాల కార్యక్రమాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...గాలికుంటు సోకిన పాడి పశువుల్లో పాల ఉత్పత్తి తగ్గుతుందన్నారు. అందుకే వ్యాధి వచ్చిన తరువాత వైద్యం కంటే ముందే టీకాలు వేయించాలని రైతులకు సూచించారు. పశు వైద్యాధికారులు సురేష్ కుమార్, సంతోష్ రెడ్డి, వెటర్నరీ సిబ్బంది సుధీర్‌గౌడ్, సాయిలు, రాములు తదితరులు పాల్గొన్నారు.

అల్లూరికి ఘన నివాళి



నినాదాలు చేస్తున్న ప్రజాపంథా నాయకులు

నందిపేట్(ఆర్మూర్): మండల కేంద్రంలో ఏఐకేఎంఎస్ ప్రజాపంథా ఆధ్వర్యంలో బుధవారం మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బ్రిటిష్ వాళ్లను మన దేశం నుంచి పారదోలడానికి మన్యం జనంతో కలిసి పోరాటం చేసి విప్లవ వీరుడని కొనియాడారు. నాయకులు కె. గంగాధర్, దేవయ్య, సతీష్, వెంకట్, ముత్యం, ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవారి కల్యాణ మహోత్సవం



కల్యాణానికి హాజరైన భక్తులు



హోమం నిర్వహిస్తున్న భక్తులు

రుద్రూర్: అక్బర్‌నగర్ శివారులోని ప్రాంతీయ వరి, చెరుకు పరిశోధన కేంద్రంలో గల పద్మావతి వేంకటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం శ్రీవారి కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. వేద పండితులు శ్రీనివాస్ శర్మ, విష్ణు శర్మ, రోహిత్ శర్మ ఆధ్వర్యంలో హోమం, కల్యాణ మహోత్సవం జరిపారు. అనంతరం అన్నదాన చేశారు. ఈ సందర్భంగా భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

నిమిషాంబ దేవి ఆలయంలో హోమం...

బాల్కొండ: మండల కేంద్రంలోని నకాశీ సంఘం ఆధ్వర్యంలో బుధవారం నిమిషాంబ దేవి ఆలయంలో భక్తులు హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో అన్నదానం నిర్వహించారు.

భూభారతి చట్టం దేశానికే రోల్ మోడల్



వివరాలు తెలుసుకుంటున్న ఈరవత్రి అనిల్

బాల్కొండ: తెలంగాణ ప్రభుత్వం తీసుకువచ్చిన భూభారతి చట్టం దేశానికే రోల్ మోడల్‌గా నిలుస్తుందని టీఎస్ఎండీసీ చైర్మన్ ఈరవత్రి అనిల్ అన్నారు. బుధవారం మెండోరా మండలం వెల్కటూర్‌లో నిర్వహించిన భూభారతి రెవెన్యూ సదస్సులో పాల్గొన్నారు. రైతుల నుంచి వస్తున్న దరఖాస్తులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. భూ సమస్యలను సత్వరమే పరిష్కరించడం కోసం భూ భారతి చట్టాన్ని ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. గత ప్రభుత్వ హయాంలో ధరణితో రైతులను దగా చేశారని మండిపడ్డారు. ఆర్డీవో రాజు గౌడ్, వేల్పూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తింటి ముత్యంరెడ్డి, వైస్ చైర్మన్ నర్సారెడ్డి, తహసీల్దార్ సంతోష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాలకు ఎవరు బాధ్యులు?

- దారి మళ్లింపుతో పెరిగిన వాహనాల రద్దీ
- కొత్తపల్లి బైపాస్ వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని కోరుతున్న ప్రయాణికులు



కొత్తపల్లి బైపాస్ రోడ్డు క్రాసింగ్ వద్ద కనిపించని సూచిక బోర్డులు

బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్రంలో జాతీయ రహదారి-44 బైపాస్ వద్ద అండర్‌వే బ్రిడ్జి నిర్మాణం చేపట్టడంతో మండలంలోని కొత్తపల్లి దారి మీదుగా జాతీయ రహదారి-44పైకి వాహనాలను మళ్లిస్తున్నారు. నెలన్నర రోజుల నుంచి వాహనాలు కొత్తపల్లి రోడ్డు మీదుగా జాతీయ రహదారిపైకి వెళ్తున్నాయి. కాని బైపాస్ క్రాసింగ్ వద్ద నాలుగు వైపు సర్వీస్ రోడ్లు ఉన్నాయి. ఎక్కడ నుంచి ఎప్పుడు వాహనం వస్తుందో తెలియని పరిస్థితి ఉంది. కాని అక్కడ ఎలాంటి సూచిక బోర్డులను ఏర్పాటు చేయలేదు. దీంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉంది. అలా ప్రమాదాలు జరిగితే ఎవరు బాధ్యులంటూ ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు. రూ.42 కోట్లతో అండర్ వే బ్రిడ్జి పనులు చేపడుతున్నారు. ఆ పనులు ఇప్పట్లో పూర్తయ్యే పరిస్థితి లేదు. ఆర్మూర్ నుంచి నిర్మల్ వైపు వెళ్లటానికి, నిర్మల్ నుంచి ఆర్మూర్ వైపు వచ్చేందుకు వాహనాలను ఈ రోడ్డు గుండానే పోవాలి. ప్రమాదాలు జరగకుండా వెంటనే సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు. కాంట్రాక్టర్.. వాహనాలను అదుపు చేయటానికి గతంలో ఒకరిని బైపాస్ క్రాస్ వద్ద ఉంచారు. కాని ప్రస్తుతం ఆ వ్యక్తి కూడా ఉండటం లేదు.

సూచిక బోర్డులు పెట్టాలి



రోడ్డు మళ్లింపు వల్ల ఈ మార్గంలో వాహనాల సంఖ్య పెరిగింది. దీంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉంది. అధికారులు స్పందించి వెంటనే సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి. - రమేశ్, స్థానికుడు

భూవివాదంపై అధికారుల విచారణ

డిచ్‌పల్లి: దూస్‌గాం శివారులో గ్రామ దేవతల కు సంబంధించిన స్థలాన్ని ఒకరు కబ్జా చేయ దానికి యత్నించడంతో గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో బుధవారం ఆర్ఐ సంతోష్, సర్వేయర్ సూర్యప్రకాష్, పోలీసులు వివాదాస్పద స్థలం వద్దకు చేరుకుని విచారణ చేపట్టారు. 30 ఏళ్లుగా ఈ స్థలాన్ని గ్రామ దేవత కోసం వినియోగిస్తున్నామని గ్రామపెద్దలు అధికారులకు తెలియజేశారు. ఇటీవల స్థలాన్ని చదును చేసిన వ్యక్తి అందుబాటులో లేకపోవడంతో అధికారులు ఆయనకు ఫోన్ చేసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆ స్థలం పట్టా భూమని గ్రామానికి చెందిన స్థలం కాదని అతడు పేర్కొన్నట్లు అధికారులు తెలిపారు. రికార్డులను పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని అధికారులు తెలిపారు.

వాసవీ మాత జయంతి



బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్రంలో ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో బుధవారం వాసవీ మాత జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అభిషేకాలు, కుంకుమార్చన పూజలు, బారసాల చేపట్టారు. భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆర్య వైశ్య సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ముప్కాల్ మండలం రెంజర్లలో..



బాల్కొండ: ముప్కాల్ మండలం రెంజర్ల గ్రామంలోని కోదండ రామాలయంలో ముప్కాల్ మండల ఆర్య, వైశ్య సంఘం ఆధ్వర్యంలో బుధవారం వాసవీ మాత జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా కుంకుమార్చన, అభిషేకాలు, డోలారోహణం చేపట్టారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. ముప్కాల్ మండలానికి చెందిన ఎస్సెస్సీ పరీక్ష ఫలితాల్లో టాపర్‌గా నిలిచిన సాయి మైథిలిని సన్మానించారు. సంఘం ముప్కాల్ మండల అధ్యక్షుడు సత్యనారాయణ, సభ్యులు పాల్గొన్నారు.

ఉచిత వేసవి శిక్షణ శిబిరం

మోపాల్/నిజామాబాద్ రూరల్: మోపాల్ జెడ్పీహెచ్ఎస్, గుపన్‌పల్లి ఉన్నత పాఠశాలలో ఈ నెల 10 నుంచి 24 వరకు విద్యార్థులకు ఉచిత వేసవి శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు మండల విద్యాధికారులు గేమ్ సింగ్, సేవులాలు వేర్వేరుగా బుధవారం తెలిపారు. యో గా,సెల్ఫ్ డిఫెన్స్, డ్రాయింగ్, డ్యాన్సింగ్, పాట లు,కంప్యూటర్, తదితర విషయాల్లో శిక్షణ ఇస్తామన్నారు.ఉదయం 8 నుంచి మధ్యాహ్న 12 గంటల వరకు ఉంటుందన్నారు. శిక్షణ సమయంలో పిల్లలకు స్నాక్స్ ఇస్తామని పేర్కొన్నారు. ఆరు నుంచి పదో తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో కోరారు.

వడ్లు పోవు.. వాన ఆగదు..!

బాల్కొండ: వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి వడ్లు పోవు.. వాన ఆగదు అన్నట్లుగా ఉంది పరిస్థితి. మంగళవారం అర్ధరాత్రి తర్వాత వాన మళ్లీ దంచి కొట్టింది. దీంతో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం, ధాన్యం బస్తాలు తడిసి ముద్దయ్యాయి. ధాన్యంతో పాటు నువ్వు, సజ్జ పంటలు కూడా దెబ్బతిన్నాయి. ధాన్యం బస్తాలను వెంటనే రైసుమిల్లులకు తరలించాలని రైతులు వేడుకుంటున్నారు.



రెంజర్లలో తడిసిన ధాన్యం బస్తాలు

ఓ వైపు నుయ్యి.. మరో వైపు గొయ్యి



సావెల్ శివారులో రోడ్డు పక్క పొదల్లో ఉన్న బావి



మరో వైపు ఉన్న గుంత

బాల్కొండ: మెండోరా మండలం సావెల్, వెల్కటూర్ గ్రామాల మధ్య సావెల్ శివారులో రోడ్డు పక్కన ఓ వ్యవసాయ బావి కనిపించకుండా ప్రమాదకరంగా ఉంది. సరిగ్గా అదే ప్రాంతంలో మరో వైపు గొయ్యి(గుంత) ఉంది. ఈ మార్గంలో ప్రయాణించే వారు ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నా ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది. రోడ్డుకు అనుకుని చెట్ల పొదల్లో కనిపించకుండా వ్యవసాయ బావి ఉంది. కనీసం బావి ఉందని హెచ్చరిక బోర్డు కూడా ఏర్పాటు చేయలేదు. రాత్రి వేళల్లో ప్రయాణికులు వెళితే ప్రమాదం బారిన పడే అవకాశం ఎక్కువగా ఉంది. గతంలో ముప్కాల్, మెండోరా మండల కేంద్రాల మధ్య గల రోడ్డు పక్కన గల బావిలో ఆటో బోల్తా పడి 11 మంది జల సమాధి అయ్యారు. అయినా అధికారులు ఎలాంటి గుణపాఠం నేర్చుకోలేదు. బావికి ఎదురుగా రోడ్డుకు అటు పక్క పెద్ద గుంత ఉంది. అదుపు తప్పితే అంతే సంగతులు అనేట్లుగా పరిస్థితి ఉంది. అధికారులు స్పందించి వెంటనే హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

విద్యుత్ ప్రమాదాలపై అవగాహన సదస్సులు



జాడిజమాల్‌పూర్‌లో వాల్‌పోస్టర్లను ప్రదర్శిస్తున్న కల్పిస్తున్న విద్యుత్ శాఖాధికారులు

బోధన్: విద్యుత్ ప్రమాదాల బారిన పడి ఏ ఒక్కరూ ప్రాణాలు కోల్పోకూడదనే ఉద్దేశంతో ముందస్తు జాగ్రత్తలపై సిబ్బంది, వినియోగదారులను అప్రమత్తం చేసేందుకు అవగాహన సదస్సులు నిర్వహించామని విద్యుత్ శాఖ బోధన్ సబ్ డివిజన్ ఏడీఈ నగేష్‌కుమార్ అన్నారు. విద్యుత్ భద్రతా వారోత్సవాల్లో భాగంగా బుధవారం సాలూర మండలంలోని జాడిజమాల్‌పూర్‌లో నిర్వహించిన అవగాహన సదస్సుల్లో ఆయన మాట్లాడారు. నాణ్యతా ప్రమాణాలు కలిగిన విద్యుత్ పరికరాలను వినియోగించాలని సూచించారు. వర్షాకాలంలో తడిసిన విద్యుత్ స్తంభాల సపోర్టు వైర్లు, విద్యుత్ పరికరాలను తాకవద్దన్నారు. విద్యుత్ భద్రత, పొదుపు సూచనలు తెలిపే కరపత్రాలు, వాల్ పోస్టర్లను ప్రదర్శించారు. ఏఈలు కల్యాణ్, లక్ష్మణ్, లైన్‌మాన్ ముజీబ్, తదితరులు పాల్గొన్నారు.

సినిమా

పీవీఆర్ మల్టీప్లెక్స్ (ఆర్మూర్)

స్క్రీన్-1	రైడ్-2(హిందీ)-10.00, 1.00, 7.25, 10.25, రెట్రో-4.00
స్క్రీన్-2	హిట్-12.30, 3.45, 7.00, 10.15
స్క్రీన్-3	రెట్రో-11.30, 2.55, 6.20, 9.45
స్క్రీన్-4	హిట్-11.30, 2.45, 6.00, 9.15

మాంసం ధరలు (రూ..)

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	190
		లైవ్	160
స్కిన్‌లెస్	220	మటన్	800

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	97,200	వెండి(కిలో)	1,00,000
22 క్యారెట్స్	89,725		

- నిజామాబాద్ బిజినెస్